# పొగబాబులూ పారాహుషార్...!

బస్సుల్లోనూ, రైళ్లల్లోనూ, సినిమా థియేటర్లలో, కార్యాలయాల్లో, పెట్రోలు బంకుల వద్ద పొగతాగడాన్ని మన దేశంతో సహా దాదాపు అన్ని దేశాల్లోనూ నిషేధించారు. (కాకపోతే దాన్ని పాటించే వాళ్లే చాలా తక్కువ) కొన్ని దేశాలలో ఈ నిషేధాన్ని ఖచ్చితంగా అమలు చేస్తుండగా, మరి కొన్ని దేశాలలో పేరుకే నిషేధాన్ని అమలు చేస్తున్నారు. అలా ఖచ్చితంగా పొగతాగడాన్ని నిషేధించిన దేశాలలో



చైనా ఒకటి. ఇక్కడ పొగతాగడాన్ని ఎప్పటి నుంచో నిషేధించినా.... పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఈ నిషేధాన్ని తమ దేశంలో కఠినంగా అమలు చేయాలని అక్కడి యంత్రాంగం నిర్ణయించింది. దీనికి రైల్వే శాఖ కూడా తమ వంతు మద్దతు ప్రకటించింది. ఇంకేముంది? నిషేధం అమలుకు అన్ని చర్యలు తీసేసుకున్నారు.

ఈ విషయం గురించి ఏ మాత్రం తెలియని ఓ ప్రబుద్ధుడు తైంజాన్ నుంచి బీజింగ్ వెళ్లే ఓ హై స్పీడు ట్రైన్ ఎక్కాడు. ఎక్కిన వెంటనే టాయిలెట్‌కి వెళ్లి అక్కడ స్టయిల్‌గా సిగరెట్ వెలిగించి ఎంచక్కా దమ్ము కొట్టడం మొదలు పెట్టాడు. ఈ ట్రైన్‌ని ఇటీవలే ఒలంపిక్స్ సందర్భంగా ప్రారంభించారు. చైనాలోని మిగతా రైళ్లలో లేని సౌకర్యాలు సైతం ఈ రైలులో కల్పించారు. అంత సౌకర్యవంతమైన, విలాసవంతమైన రైలులో ఎక్కి హాయిగా వెళ్లవలసిన చోటుకి వెళ్లకుండా టాయిలెట్‌కి వెళ్లి సిగరెట్టు వెలిగించి పోలీసుల చేతికి చిక్కాడు పాపం ఆ వ్యక్తి. అన్ని రైళ్లల్లో ఏర్పాటు చేసిన మాదిరిగానే సిగరెట్ తాగడం చట్టరీత్యా నేరం అన్న బోర్డులను ఆ రైలులో కూడా ఏర్పాటు చేశారు. ఆ బోర్డులను ఆషామాషీగా తీసుకున్నాడే తప్పించి అసాధారణ రీతిలో పోలీసులు రంగప్రవేశం చేస్తారని అతను ఏమాత్రం ఊహించలేకపోయాడు. అతను సిగరెట్ వెలిగించగానే అలారం గణగణమంటూ మోగడం, పోలీసులు వచ్చి అరదండాలు వేసి అదుపులోకి తీసుకోవడం రెప్పపాటులో జరిగిపోయాయి. ఈ సంఘటనతో అయినా చైనాలో పొగతాగేవారిలో మార్పు వస్తుందని అక్కడి యంత్రాంగం ఆశిస్తోంది.!

## 'సరసి' కథ

వైశంపాయనుడు పని చేస్తున్న ఆఫీసు చాలా స్ట్రిక్టు. సందర్శకుల్ని అంత ఈజీగా లోపలికి వదలరు. మధ్యాహ్నం మూడు దాటేక, పాస్ తీసుకున్నాకనే అనుమతిస్తారు. అయితే చెకోడీలూ, జంతికలు అమ్ముకునే వాళ్లు; ప్యాంటు పీసులూ, చీరలూ, దుప్పట్లూ ఇన్‌స్టాల్‌మెంట్సు మీద ఇచ్చేవాళ్లూ; సెంట్లు పూస్తూ చిన్న పెట్టెలతో తిరిగే వాళ్లూ ఉదయం పదిన్నర నించే సెక్షన్లలో కిళ్లీలు నములుతూ కనిపిస్తారు.

ఆ రోజు ఫస్టు తారీఖు. వైశంపాయనుడి సెక్షనులో అందరి జేబులూ జీతాలతో కళకళలాడుతూ వుంటే, ఆ జేబుల యజమానులు నవ్వులతో ఫెళఫెళ లాడుతున్నారు. ఇంతలో ఓ సేల్సుమన్ సంచిలో సరుకులతో సెక్షను కొచ్చాడు. వైశంపాయనుడి దగ్గరకు వెళ్లి ''క్రితం సారి వచ్చినప్పుడు చారుపొడి తెమ్మన్నారు కదా సార్, ఇదిగో.'' అంటూ ఓ పొట్లం తీసి అతడి చేతిలో పెట్టాడు. ఆ పొట్లం నుంచి వస్తున్న ఘుమఘుమలకి ఆకర్షితులై సెక్షను వాళ్లందరూ పోగయ్యారు.

''ఎంతయ్యా ఏకాంబరం?'' అని అడిగేడు వైశంపాయనుడు. ''డబ్బుల్దేం వుంది సార్, ఈ క్షణాన్నుంటాయి, తర్వాత పోతాయి, నమ్మకం ప్రధానం!'' అన్నాడు సేల్సుమన్ వినమ్రంగా. ఆ మాటతో అందరికీ నమ్మకం కలిగింది. ''టేస్టు చూసి, బాగుం

# చారుపొడి




టేనే తీసుకోండి సార్'' అంటూ, సంచిలోంచి ఓ పొట్లం తీసి, చివర చింపి అందరి చేతుల్లోనూ కాస్త కాస్త పొడి పోశాడు.

''తస్సాదియ్యా, భలే ఘాటుగా వుందయ్యా'' అంటూ, అందరూ నాకేశారు. టేస్టుగా వుందని, మరి కాస్త వేయించుకుని, నాకేసి, చేతులు దులుపుకున్నారు. ''ఓ రూపాయి తక్కువ చేసిస్తాడు, తీసుకోండి. మనకి తెలుసున్నవాడే'' అన్నాడు వైశంపాయనుడు, తనే ఆర్డరిచ్చి ఆ చారుపొడి చేయించినట్టూ, ఆ ఘనత తనదే నన్నట్టూ గర్వంగా ఫేసు పెట్టి. సేల్సుమన్ స్థితప్రజ్ఞుడిలా మందహాసం చేశాడు.

తర్వాత ఏం జరిగిందో తెలియదు. నిమిషాల్లో ఆ చారుపొడి అందరినీ వేరే ఏదో లోకం లోకి తీసుకుపోయింది. పది పదిహేను నిమిషాలకి ఏదో మత్తు వీడినట్లయి ఒక్కొక్కళ్లూ కళ్లు తెరిచేరందరూ. అప్పటి వరకూ అక్కడున్న సేల్సుమన్ లేడు. పేకట్లూ లేవు, సంచీ లేదు. జేబులు తడుముకుంటే డబ్బులూ లేవు. నోట్లో చారుపొడి ఘాటు మాత్రం మిగిలింది.

*